సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం, 18, ఆగస్టు, 2022

పరుగుల 'గిరి' బిడ్డ

- మారథాన్‌లో రాణిస్తున్న గోపి
- సచివాలయ ఉద్యోగిగా సేవలు
- పుణెలో జరిగే పోటీలకు కసరత్తు



- సెంటర్‌స్ప్రెడ్‌లో..

అపురూప కలెక్షన్

- స్టాంప్‌లు, నాణేలు సేకరించిన విశ్రాంత రైల్వే ఉద్యోగి కృష్ణారావు
- జాతీయ స్థాయిలో ప్రదర్శనలు

- సెంటర్‌స్ప్రెడ్‌లో..





గిరి యువతకు ఉపాధి, ఉద్యోగాలు

- పోలీసు శాఖ కృషి
- ఎస్పీ సతీష్‌కుమార్ 8లో

న్యూస్‌రీల్

అంతర్జాతీయ స్థాయిలో కాఫీకి మరింత గుర్తింపు

- రూ.4.5 కోట్లతో ఎకో పల్పింగ్ కేంద్రం నిర్మాణం
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



జి.కె.వీధిలో ఎకో పల్పింగ్ యూనిట్ కేంద్రం స్థలాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

గూడెంకొత్తవీధి : అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య పంటగా కాఫీకి మరింత గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. మండలంలో బుధవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎకో పల్పింగ్ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలోని కాఫీ పంట విస్తీర్ణంపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, జి.కె.వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు ప్రాంతాల్లో కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతీ తెచ్చేందుకు ఎకో పల్పింగ్ మిగతా 2వ పేజీలో ▸

జోరుగా.. హుషారుగా



హుకుంపేట మండలం గన్నేరుపుట్టులో వరినాట్లు వేస్తున్న గిరిజనులు

- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వరినాట్లు
- కలిసొచ్చిన వర్షాలు
- నెలాఖరు నాటికి పూర్తి

సాక్షి, పాడేరు : జిల్లాలో ఖరీఫ్ నాట్లు జోరందుకున్నాయి. గిరిజన రైతులు వ్యవసాయ భూముల్లో దమ్ము, వరినాట్ల పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులకు ఉపయోగపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏటా జిల్లాలో 59,189 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయడంతో వాటిని కొనుగోలు చేసిన రైతులంతా ముందస్తుగా వరి నారుమళ్లు తయారు చేసుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ఆశాజనకంగా నారుమళ్లు ఎదిగాయి. దీంతో వరినాట్లు ఉత్సాహంగానే ప్రారంభమయ్యాయి. లోతట్టు భూముల్లో జులై నెలాఖరు నాటికే వరి నాట్లను రైతులు పూర్తి చేశారు. మెట్ట భూముల్లో మాత్రం వరినాట్లు కాస్త ఆలస్యమయ్యాయి. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వరినాట్లను ఉత్సాహంగానే చేపడుతున్నారు. ఇప్పటికి విలీన మండలాల్లో మినహా జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 25,164 హెక్టార్లలో వరినాట్లు పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్ నందు తెలిపారు.

మేలు చేసిన వర్షాలు

రెండు నెలల నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ వర్షాలు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తున్నాయి. గోదావరి, శబరి నదుల వరద ఉధృతితో విలీన మండలాల్లోని ముంపు గ్రామాల్లో వ్యవసాయానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. మిగిలిన అన్ని చోట్ల వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వరి నాట్లు జోరందుకున్నాయి. ఈ నెలాఖరుకు దాదాపు అన్ని చోట్ల వరినాట్లు పూర్తికానున్నాయి.

పుష్కలంగా ఎరువులు



అన్ని ఆర్‌బీకేల్లో పుష్కలంగా ఎరువులను అందుబాటులో ఉంచాం. అవసరమైన చోట సబ్సిడీపై రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నాం. గోదావరి, శబరి నదుల వరద ఉధృతితో విలీన మండలాల్లోని ముంపు గ్రామాల్లో వ్యవసాయానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. మిగిలిన చోట్ల వ్యవసాయ పనులు హుషారుగా సాగుతున్నాయి.

– ఎస్.బి.ఎస్.నందు, వ్యవసాయ అధికారి, అల్లూరి సీతారామరాజు జిల్లా

'ఫేషియల్ రికగ్నిషన్' నమోదు తప్పనిసరి

డీఈవో డాక్టర్ రమేష్

2లో

అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యం

రాజవొమ్మంగి జీసీసీ మేనేజర్

2లో



చింతూరులో నీటమునిగిన సంతపాకల ప్రాంతం

జలదిగ్బంధం

- విలీన మండలాల్లో కొనసాగుతున్న వరద ఉధృతి
- సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు
- వరద నీటిలో మునిగి వ్యక్తి మృతి

చింతూరు/కూనవరం/వీఆర్‌పురం: వరద నీటి ఉధృతి పెరగడంతో విలీన మండలాల్లో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టినా విలీన మండలాల్లో మాత్రం వరద ఉధృతి కొనసాగుతోంది.బుధవారం రాత్రి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 54.4 అడుగులకు చేరుకుంది. ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లో బుధవారం రాత్రి వరకు వరద పెరుగుతూనే ఉంది. ఎటపాక మండలంలో ప్రధాన రహదారులపైకి వరదనీరు చేరడంతో భద్రాచలంతో పాటు ఇతర మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలంలో కూనవరం, టేకులబోరు, శబరి కొత్తగూడెం, చినార్కూరు, కొండ్రాజుపేట, పూసుగూడెం, ముల్లూరు, తాళ్లగూడెం గ్రామాల్లోకి వరదనీరు చేరింది. కరకగూడెం గ్రామానికి చెందిన కరక జోగయ్య (48) అనే వ్యక్తి తన దుక్కిటెద్దులు కనిపించడం లేదని వెతుక్కుంటూ వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో కొండాయిగూడెం–కరకాయి గూడెం మధ్యలోని కాజ్‌వేపైన గోదావరి వరద నీటిని దాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ వెంకటేష్ కేసు మిగతా 2వ పేజీలో ▸

పిల్లలందరూ బడిలో ఉండాలి

- డ్రాపౌట్స్ లేకుండా చర్యలు
- కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు : బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ఆశ్రమ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్‌లోని 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీవోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 8,9,10వ తరగతుల విద్యార్థులు ఎక్కువగా బడి మానేస్తున్నారన్నారు. డ్రాపౌట్స్ తగ్గించడానికి సచివాలయ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవోలు, ఏటీడబ్ల్యూవోలు ఉపాధ్యాయులు, వలంటీర్లతో తరచూ సమావేశమై విద్యపట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని, ఆశ్రమ పాఠశాలలను ఏటీడబ్ల్యూవోలు తరచూ తనిఖీలు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల ఫోన్ నంబర్లు ఆయా విద్యా సంస్థల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించడానికి ముందుగానే షెడ్యూలు సిద్ధం చేసుకుని ప్రకటించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరైతే తీవ్రంగా పరిగణిస్తామని, అవసరమైతే సెలవు పెట్టుకోవాలే గాని గైర్హాజరైతే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందిస్తూ గ్యాస్, బియ్యం సకాలంలో సరఫరా చేయాలని జీసీసీ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు బల్క్‌గా సరఫరా చేసే పెరుగును 15 రోజులకు ఒక్కసారి కాకుండా రెండు మూడు రోజులకు ఒకసారి సరఫరా చేయిస్తామన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా గుర్తిస్తే వారికి పింఛన్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు, 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు



వానమామిడిగొంది, పులుసుమామిడి గ్రామాల మధ్య కూలిన చెట్టు

వై.రామవరం: మండలంలోని పులిసిమామిడి, వానమామిడిగొంది గ్రామాల మధ్య ప్రధానరహదారికి అడ్డంగా మంగళవారం రాత్రి మామిడి చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పులుసుమామిడి, అన్నంపాలెం, బూరుగుపాలెం, అమ్మ పేట, ములగలపూడి తదితర గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. బుధవారం ఉదయం గ్రామస్తులు ఆ చెట్టును తొలగించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఈఈకి పదోన్నతి



జవహర్ కుమార్

సాక్షి,పాడేరు : గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్యం విభాగంలో పాడేరు ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్న జవహర్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి ఈఈగా పదోన్నతి కల్పించింది. ప్రస్తుతం ఆయన డీఈఈ కేడర్‌లోనే ఇన్‌చార్జి ఈఈగా పనిచేస్తున్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత ఇన్‌చార్జి ఎస్‌ఈగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జవహర్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఈఈగా పదోన్నతి కల్పించి అనంతపురం జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా గుడివాడ నుంచి వేణుగోపాల్‌ను పాడేరు ఈఈగా ప్రభుత్వం నియమించింది. ఆయన గుడివాడలో డీఈఈగా పనిచేస్తూ ఈఈగా పదోన్నతి పొందారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యం

జీసీసీ రాజవొమ్మంగి బ్రాంచ్ మేనేజర్ విజయలక్ష్మి



రాజవొమ్మంగి : ప్రతి డిపో పరిధిలో గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జీసీసీ రాజవొమ్మంగి బ్రాంచ్ మేనేజర్ ఎం.విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. గత ఆర్థికసంవత్సరంలో గిరిజనుల నుంచి రూ.24 లక్షల విలువైన నల్లజీడిపిక్కలు, నరమామిడి చెక్క, శీకాయ, తేనె, ముషిని గింజలు తదితర సరకులు కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది జూలై నెలాఖరు వరకు రూ.4.95 లక్షల విలువైన చింతపండు తదితర సరకులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. రాజవొమ్మంగి గిరిజన కోఆపరేటివ్ ప్రైమరీ మార్కెటింగ్ సొసైటీ సుమారు రూ. 4 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందని మేనేజర్ చెప్పారు. ఆర్‌ఎండీ (రిటైల్‌మార్కెటింగ్ డ్రైవ్) ద్వారా టీ, కాఫీ, త్రిఫల్ రస్, తేనె, సబ్బులు, షాంపులు, పసుపు, శీకాయపొడర్ తదితర గిరిజన ఉత్పత్తులను కూడా విక్రయిస్తున్నట్టు తెలిపారు. రాజవొమ్మంగిలో నిర్వహిస్తున్న జీసీసీ సూపర్‌మార్కెట్ ద్వారా నెలకు రూ.7లక్షల అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. రాజవొమ్మంగి బ్రాంచ్ పరిధిలో 16 చౌకడిపోలు, మరో 14 సబ్ డిపోలు పనిచేస్తున్నాయన్నారు. వీటి ద్వారా ప్రతి నెలా 258 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మరో 90 క్వింటాళ్ల పంచదార, 60 క్వింటాళ్ల కందిపప్పు ఇస్తున్నామన్నారు. వసతి గృహాలకు ప్రతి నెలా దాదాపు 62 టన్నుల బియ్యం తమ బ్రాంచ్ ద్వారా సరఫరా చేస్తున్నామని విజయలక్ష్మి వివరించారు. ప్రభుత్వం ఇటీవలే కొత్తగా మండల లెవెల్ స్టాక్ పాయింట్ (సరకుల గోదాము) ఏర్పాటు చేసిందని, తద్వారా పేదలకు సకాలంలో ఆహారదినుసులను అందించగలుగుతున్నామని వివరించారు.

'ఫేషియల్ రికగ్నిషన్' నమోదు తప్పనిసరి

డీఈవో డాక్టర్ రమేష్



సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 6వేల మంది ఉపాధ్యాయులు ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను తప్పనిసరిగా తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రమేష్ ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందన్నారు. సెల్‌ఫోన్లలోయాప్ నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు ఉదయం 9గంటల్లోపే పాఠశాలలకు చేరుకుని ఫేషియల్ రికగ్నిషన్ హాజరును నమోదు చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేరిన తర్వాత ఫొటో తీసుకున్న వెంటనే ఆన్‌లైన్‌లో ఉంటే నమోదవుతుందని, ఆఫ్‌లైన్‌లో మాత్రం తిరిగి ఇంటికి చేరే సమయంలో సెల్ సంకేతాలు ఉన్నచోట దానంతట అదే అప్‌లోడు అవుతుందని డీఈవో తెలిపారు. ఆఫ్‌లైన్‌లో కూడా నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో గిరిజన ప్రాంతాల ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి పాఠశాలలకు చేరుకోవాలని, పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈవో సూచించారు. ప్రతి ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో 14417 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రదర్శించాలని, గోడపై ఈ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. పాఠశాల పరిధిలో ఎలాంటి సమస్యలున్నా ఆయా ప్రాంతాల్లోని తల్లిదండ్రులు, ఇతర వర్గాలన్నీ ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సేవలను పొందాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ ఫిర్యాదులను నమోదు చేసుకునేందుకు జిల్లా కేంద్రమైన పాడేరు డీఈవో కార్యాలయంలో డిస్ట్రిక్ట్ ఎకడమిక్ మానిటరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఏడీని ఇన్‌చార్జిగా నియమిస్తున్నామన్నారు. అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆయా పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు సంబంధించి దరఖాస్తులను కూడా స్వీకరిస్తున్నామని డీఈవో తెలిపారు. 15ఏళ్ల పాటు ఉత్తమ సర్వీసులు అందించడంతో పాటు నాడు–నేడు పనుల్లో నాణ్యత, వృత్తిపరంగా ఇంత వరకు కనబరిచిన పనితీరు, ఇతర అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకుని ఆయా ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని డీఈవో తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలో కాఫీకి మరింత గుర్తింపు

▶ 1వ పేజీ తరువాయి



చింతపల్లిలో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీవో గోపాలకృష్ణ

యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎకో పల్పింగ్ కేంద్రాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. జి.కె.వీధిలోని అద్దేరివీధి గ్రామానికి చెందిన దేవేంద్ర, బాలకృష్ణలకు చెందిన నాలుగు ఎకరాల పట్టా భూమిని ఇచ్చారని, వారికి ఎకో పల్పింగ్ కేంద్రంలో ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు. ఎకో పల్పింగ్ యూనిట్ కేంద్రం నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం జి.కె.వీధి–1 సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అర్హులైన గిరిజనులకు పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.సుభద్ర, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, ఏఈ, కోఆప్షన్ సభ్యుడు దావీదు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

చింతపల్లిలో

చింతపల్లి: మండల కేంద్రంలో కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం చింతపల్లిలో పర్యటించిన ఆయన పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకో పల్పింగ్ యూనిట్ వల్ల గిరిజన కాఫీ రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పల్పింగ్ యూనిట్‌వద్ద రెండు ఎకరాల్లో కాఫీ పండ్లు, గింజలు నిల్వచేసుకునేందుకు భవనాలు నిర్మిస్తామని తెలిపారు. పల్పింగ్ యూనిట్ వద్ద పూల మొక్కలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రాజు,తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండల కేంద్రంలో నిర్మిస్తున్న కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ పనులను పాడేరు ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు,గిరిజన సంక్షేమశాఖ ఈఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధం

▶ 1వ పేజీ తరువాయి



సురక్షిత ప్రాంతంలో భద్రపరుచుకున్న సామాన్లు



కరక జోగయ్య మృతదేహం

నమోదు చేశారు. జోగయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కరక గూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వీఆర్‌పురం మండలంలో కూడా పలు గ్రామాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్నారు. గోదావరి ఎగపోటు కారణంగా శబరినది కూడా క్రమేపీ పెరుగుతోంది. చింతూరు వంతెన వద్ద శబరినది నీటి మట్టం బుధవారం రాత్రికి 45 అడుగులకు చేరుకుంది. దీంతో వరదనీరు గ్రామాల్లోకి ప్రవేశిస్తోంది. చింతూరులోని శబరిఒడ్డు, సంతపాకలు, టోల్‌గేట్, లారీఆఫీస్, పంచాయతీ రహదారి, వీఆర్‌పురం రహదారి ప్రాంతాలతో పాటు ఏజీకోడేరులో ఇళ్లలోకి వరదనీరు ప్రవేశించడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుతుండడంతో గురువారం ఉదయం నుంచి శబరినది కూడా తగ్గే అవకాశముంది. కాగా వరదనీరు పెరుగుతూ రహదారుల పైకి చేరడంతో బుధవారం మరిన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



వీఆర్‌పురం ఆర్టీ సెంటర్ వద్ద ఇళ్లలోకి చేరిన వరద నీరు

వీఆర్‌పురం మండలంలో ధర్మతాళ్లగూడెం పూర్తిగా ముంపునకు గురైంది. దీన్ని ఆనుకొని ఉన్న వీఆర్‌పురం గ్రామాన్ని సైతం వరద నీరు చుట్టుముట్టింది. వీఆర్‌పురం ఆర్టీ సెంటర్,పాతగొల్లగూడెం,పెట్టవీధుల్లోని పలు ఇళ్లలోకి వరదనీరు ప్రవేశించింది. రాజుపేటకాలనీలో సైతం 100కు పైగా ఇళ్లలోకి వరదనీరు చేరింది. దీంతో వీఆర్‌పురం గ్రామస్తులు రేఖపల్లిలోని సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్నారు.భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 9 గంటలకు గోదావరి నీటి మట్టం మూడవ ప్రమాద స్థాయి దాటి 54.4 అడుల వద్ద ప్రవహిస్తోంది.

మావోయిస్టు వారోత్సవాలు విఫలం

ఎస్పీ సతీష్‌కుమార్

సాక్షి, పాడేరు : ఏవోబీ వ్యాప్తంగా మావోయిస్టుల కార్యక లాపాలపై దృష్టి సారించామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల మావోయిస్టుల వారోత్సవాలు కూడా విఫలమయ్యాయని, మావోయిస్టుల ప్రాబల్యం సరిహద్దులోని ఒడిశాలోని మల్కన్‌గిరి, చత్తీస్‌గ ఢ్‌లోని కుంట, వర్ల ప్రాంతాల్లో ఉన్నట్టు అనుమానిస్తున్నా మని, ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని, మావోయిస్టుల అమర వీరుల వారోత్సవాలకు అడ్డుకట్ట వేసేందుకు కూడా పోలీసుల భద్రతా చర్యలు దోహదం చేసాయన్నారు. నిరంతరం వాహనాల తనిఖీలతో పాటు ఏరియా డామినేషన్ టీంలు,కూంబింగ్ పార్టీలన్నీ సమర్థ వంతంగా పనిచేసాయని, మారుమూల ప్రాంతాలకు ముం దస్తుగా ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల సర్వీసులను నిలి పివేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను కూడా కూంబింగ్ పార్టీలు వినియోగిం చాయని ఎస్పీ తెలిపారు. పోలీసుశాఖ గిరిజనాభివృద్ధి లక్ష్యంతో పనిచేస్తుందని, ఏవోబీలో పోలీసు యంత్రాం గాన్ని మరింత పటిష్టం చేసి మావోయిస్టు కార్యకలాపాలను నిరోధించేందుకు శ్రమిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు సీఐ సుధాకర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పెండింగ్ కేసులు పరిష్కరించాలి : ఎస్పీ గౌతమిసాలి

అనకాపల్లిటౌన్ : జాతీయ రహదారి 16 రోడ్డులో ప్రమా దాలు నివారణ చర్యలలో భాగంగా వాహనాలు నిలుపుటకు కేటాయించిన ప్రదేశాల్లో తప్ప వేరే ఎక్కడైనా వాహనాలు నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గౌతమిసాలి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తీవ్రమైన, సాధారణ పెండిం గ్ కేసులు విషయమై ఆయా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ఓవర్ లోడింగ్‌తో వెళ్తున్న వాహనా లపై ట్రాఫిక్ పోలీస్‌లు కేసులు నమోదు చేయాలని సూచిం చారు. సైబర్ క్రైమ్, ఫ్రాడ్స్ ఇన్వెస్టిగేషన్ స్కిల్స్, స్టేషన్ మేనే జ్‌మెంట్ పై అధికారులకు 6 బృందాలుగా విభజించి పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జూలై నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబర్చిన 33 మంది సిబ్బందిని ఆమె అభినందించారు. అంతకు ముందు కార్యాలయం ఆవర ణలో మొక్కలను ఎస్పీ నాటారు. కార్యక్రమంలో నర్సీపట న్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ శ్రీ మణికంఠ చందోలు, క్రైం జిల్లా ఎస్పీ బి.లక్ష్మీనారాయణ, జిల్లా అదనపు ఎస్పీ(పరిపా లన) బి. విజయభాస్కర్, డీటీసీ డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ మళ్ల మహేష్, సీఐలు దాడి మోహనరావు, లక్ష్మణమూర్తి, నరసిం హారావు పాల్గొన్నారు.



దిశ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మళ్ల మహేష్‌కు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అనకాపల్లి ఎస్పీ గౌతమిసాలి

క్లుప్తంగా...

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్ఐ నాగేశ్వరరావు

కశింకోట: మండలంలోని అచ్చెర్ల– మోసయ్యపేట గ్రామాల మధ్య ఏలేరు కాలువ ప్రవాహంలో ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చిన సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృ తదేహాన్ని గుర్తించి వెలికి తీసినట్టు అదనపు ఎస్ఐ జె. నాగేశ్వరరావు తెలిపారు. మృతుడు గులాబీ గళ్ల షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని అనకా పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భద్రపరిచామ న్నారు. కేసు నమోదు చేశామన్నారు. ప్రమాదవ శాత్తు కాలువలో జారి పడి మృతి చెంది ఉండవ చ్చునని భావిస్తున్నారు.

18 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్



చీడికకొత్తూరు ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి: చీడికకొత్తూరులో ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ విజి లెన్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ తిరుపతిరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీడికకొత్తూరులో శ్రీలక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ పేరుతో లైసెన్స్ ఎరువుల దుకాణం ఉంది. బుధవారం ఈ దుకాణాన్ని విజి లెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈపోస్ యంత్రంలో నమోదు చేసిన సరుకుకు, దుకాణంలో ఉన్న సరుకుకు నిల్వల్లో తేడా ఉన్నట్టు గుర్తించారు. 26 బస్తాల ఎరువులు అధికంగా ఉన్నాయని, దీంతో దుకాణంలో గల రూ.1.79 లక్షల విలువైన 18 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఈవో సత్యనారాయణ, సిబ్బంది రంగా పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఏపీపీఎస్సీ సభ్యుడు



గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న సోనీహుడ్

పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు సోనీహుడ్ మానవత్వం చాటుకున్నారు. సోనీహుడ్ తునిలో తన స్వగృహం నుంచి నక్కప ల్లి కార్యక్రమానికి బయ లుదేరారు. పాయకరా వుపేట లింగాలకాలనీ సమీపాన దుర్గాకాలనీ నివాసిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గాయాలతో రోడ్డు పక్కన పడి వున్నాడు. గాయ పడ్డ వ్యక్తి చుట్టూ కొందరు గుమిగూడి ఉండడం గమనించిన సోనీహుడ్ వెంటనే తన కారులో తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు సోనీహుడ్ తెలి పారు. గాయపడ్డ వ్యక్తి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు.

పడవెక్కినా ప్రాణం దక్కలేదు...

● చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తూ కిడ్నీ రోగి మృతి

వీఆర్‌పురం : చికిత్స కోసం నిండు గోదారిపై పడవలో కిడ్నీ పేషెంట్‌ను తరలిస్తుండగా మార్గం మధ్యలోనే అతడు మృ తి చెందిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలం చింతరేవుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివ రాల ప్రకారం గ్రామానికి చెందిన కిడ్నీ పేషెంట్ గూటాల సుబ్బారావు(63) కొన్ని రోజులుగా రంపచోడవరం ప్రభు త్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇటీవల వరదలు తగ్గుముఖం పట్టడంతో వారం రోజుల క్రితం స్వగ్రామం చింతరేవుపల్లి వచ్చాడు. తిరిగి డయాలసిస్ చేయించుకునేందుకు వెళదామను కునే సమయానికి గ్రామాన్ని వరద నీరు చుట్టు ముట్టింది. విషయం తెలు సుకున్న సర్పంచ్ పిట్టా రామారావు సమాచారాన్ని తహసీల్దార్ ఎన్. శ్రీధ ర్‌కు తెలియచేశారు. ఆయన ప్రత్యేక బోట్ ఏర్పాటు చేసి ముందుగా చిం తూరు తరలించి అక్కడి నుంచి రంప చోడవరం తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో సుబ్బారావు పడవలోనే మృతి చెందడంతో మృతదేహాన్ని అదే పడవలో గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేపట్టారు.



చికిత్స కోసం సుబ్బారావును పడవలో తరలిస్తున్న దృశ్యం

యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత

సాక్షికి స్పందన



ఇసుక బస్తాలు, కర్రలు, సిమెంటుతో కట్టుదిట్టంగా పూడ్చిన గండి

రావికమతం : కల్యాణపులోవ రిజర్వాయర్ ప్రధాన కాలువకు పడిన గండిని ఆయకట్టు రైతుల సహాయ సహకారాలతో యుద్ధ ప్రాతిపదికన బుధవారం పూడ్చివేశారు. సుమారు 5వేల ఎకరాలకు నీరందించే ప్రధాన కాలువకు స్థానిక చీమల పాడు అక్విడెక్ట్ వద్ద రెండు రోజుల క్రితం భారీ గండి పడిన సంగతి తెలిసిందే. దీంతో కాలువ ద్వారా నీరు నిలిచిపోవడం తో ఆయకట్టు భూముల్లో చేపట్టిన దమ్ము పనులు అర్ధంతరం గా నిలిచిపోయాయి. దీనిపై 'కల్యాణపులోవ కాలువకు గండి' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారి సత్య నారాయణ దొర స్పందించారు. స్థానిక రైతులను సంప్రదించ డంతో రైతు నాయకులు గట్రెడ్డి రాము, వెంకట్రావు ఇతర రైతులు పలువురు సహాయ సహకారాలందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అధికారులు వారితో కలిసి ఇసుక బస్తాలు, సిమెంటు పనులతో బుధవారం సాయంత్రానికి గండిని పూర్తిగా పూడ్చివేశారు. అధికారులు నీటిని ట్రయల్ రన్ వేసి అంతా సురక్షితంగా ఉందని నిర్ధారిం చుకుని ఆపై యథావిధిగా 30 క్యూసెక్కుల నీటిని కాలువ ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. దీంతో ఆయ కట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

హత్య కేసులో నిందితులపై చర్యకు డిమాండ్


డీజీపీకి ఫిర్యాదు చేసిన బాధితులు

నక్కపల్లి : అమలాపురం గ్రామానికి చెందిన చిట్టిమని సత్తి బాబు హత్యకు గురై నాలుగు నెలలు గడుస్తున్నా నింది తులపై ఇంత వరకు చర్యలు తీసుకోలేదని బాధిత కుటుంబం నక్కపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేసింది. రాష్ట్ర డీజీపీ కే.వి.రాజేంద్రనాథ్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు. హతుడు సత్తిబాబు తల్లి రమణమ్మ తెలిపిన వివరాల మేరకు ఏప్రిల్ 30వ తేదీన అమలాపురం గ్రామానికి చెందిన సత్తిబా బును అదే గ్రామానికి చెందిన స్నేహితులు దుంగా ప్రసాద్, కనక రాజు, చిట్టిమని ప్రసాద్ మద్యం సేవిద్దాం రమ్మని తీసుకెళ్లారు. అయితే సత్తిబాబు తిరిగి ఇంటికి రాలేదు. మరు సటి రోజు రాత్రి గుల్లిపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టా లపై సత్తిబాబు మృతదేహం కనిపించింది. గ్రామానికి చెం దిన ముగ్గురు వ్యక్తులు తమ కుమారుడిని మద్యం సేవించేం దుకు తీసుకెళ్లారని తెలియడంతో ఘటనపై వెంటనే నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కానీ ఇంత వరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయలేదని ఆరోపించారు. బాధితులకు మద్దతుగా ప్రజా సం ఘాలు, మత్స్యకార సంఘాలు ఆందోళన నిర్వహించారు. తక్షణమే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ మత్స్యకార సంఘ ఉపాధ్యక్షుడు మోసా అప్పలరాజు తదిత రులు డిమాండ్ చేశారు.



నక్కపల్లి పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన కుంజా వెంకటేష్

చింతూరు : తాటిలం కకు చెందిన కుంజా వెం కటేష్ (38) బుధవారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి గ్రామా నికి తిరిగి వస్తున్న క్రమంలో బొడ్డుగూడెం లో అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు



నక్క చంద్రిక (ఫైల్)

తుమ్మపాల: అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటనపై పోలీ సులకు ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ నర్సింగరావు తెలిపిన వివరాలి వి. పిసినికాడ గ్రామానికి చెందిన నక్క చంద్రిక(16) ఈ నెల 16వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని తం డ్రి సత్తిబాబు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ న్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెం. 9440796085కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

బైక్ చోరీలపై విచారణ

చింతపల్లి : మండల కేంద్రంలో రెండు రోజులుగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. మంగళవారం రాత్రి వైఎస్సార్ అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ బుల్లెట్, రామాలయం వీధిలోని గిరి అనే యువ కుడి పల్సర్ వాహనం చోరీకి గురయ్యాయి. దీనిపై బాధి తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధా రంగా విచారణ చేస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ మహ్మద్ ఆలీ తెలిపారు.

గిరి యువతకు ఉపాధి, ఉద్యోగాలు

- పోలీసు శాఖ కృషి • ఎస్పీ సతీష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని వెనుకబడిన మండలాల్లోనిమారుమూల గ్రామాల్లో గిరిజన యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసుశాఖ కృషి చేస్తోందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో జీఎంఆర్ సంస్థకు చెందిన నాగావళి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో జి.మాడుగుల, ముంచంగిపుట్టు, అడ్డతీగల, పెదబయలు, వై.రామవరం, గంగవరం మండలాలకు చెందిన 35 మంది గిరిజన యువతులకు నర్సింగ్ శిక్షణ నిర్వహించామన్నారు. విజయనగరం జిల్లా రాజాంలో హోం నర్సింగ్ కోర్సును గత నెల 8వ తేదీ నుంచి ఈ నెల ఏడు వరకు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయన్నారు. శిక్షణ పొందిన గిరిజన యువతులకు ఉద్యోగావకాశాలను కల్పించామని చెప్పారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖలో 35 మందికి ఉద్యోగాలు కల్పించామని, నెలకు రూ.15వేల వేతనాన్ని సదరు సంస్థ చెల్లించడంతో పాటు ఉచిత భోజనం, ఇతర వసతి సౌకర్యాలన్నింటిని కల్పిస్తుందన్నారు. తొలి విడతగా జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని 17 మంది గిరిజన యువతులు బుధవారం హైదరాబాద్‌లో ఉద్యోగాల్లో చేరేందుకు బయలుదేరుతున్నారని ఎస్పీ తెలిపారు. ఈ నెల 23న అడ్డతీగల, వై.రామవరం, గంగవరం మండలాలకు చెందిన 15 మంది యువతులు హైదరాబాద్‌కు రెండవ విడతలో ఉద్యోగ నిమిత్తం వెళ్తారని ఎస్పీ తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఉద్యోగాల్లో చేరిన గిరిజన యువతులకు పోలీసుశాఖ అన్నివిధాలా సహకరిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రేరణ కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామన్నారు. తద్వారా వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.సీఐ సుధాకర్ పాల్గొన్నారు.



నర్సింగ్ ఉద్యోగాలకు హైదరాబాద్ వెళుతున్న గిరిజన యువతులతో ఎస్పీ సతీష్‌కుమార్, పాడేరు సీఐ సుధాకర్

ఉద్యానవన నర్సరీల అభివృద్ధికి కార్యాచరణ

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

సాక్షి,పాడేరు: ఐటీడీఏ పరిధిలోని హెచ్ఎన్‌టీసీ(ఉద్యాన వన నర్సరీలు) అభివృద్ధికి కార్యాచరణ వెంటనే సిద్ధం చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపల్లి, అరకులోయ మండలం కొత్తవలస హెచ్ఎన్‌టీసీల్లో ఔషధ మొక్కలు, ఉద్యానవన తోటలు, మిరియాల నర్సరీల పనులను వెంటనే ప్రారంభించాలని పీవో ఆదేశించారు. భూమి చదును పనులను చేపట్టాలన్నారు. నర్సరీలకు అవసరమయ్యే నీటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాలీహౌస్‌ల నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కొత్తవలస హెచ్ఎన్‌టీసీ భూములపై సమగ్రమైన సర్వే చేసి నివేదిక వెంటనే సమర్పించాలని అరకులోయ తహసీల్దార్‌ను ఆదేశించారు. హెచ్ఎన్‌టీసీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక ఉపకరణాలను అందిస్తామని, గిరిజన రైతులకు అవసరమైన ఉద్యాన మొక్కలను నర్సరీల్లో పెంచి రైతులకు సరఫరా చేస్తామన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

నర్సరీల పెంపకంపై ప్రత్యేకమైనశ్రద్ధ తీసుకోవాలని, ఉద్యానవన అధికారులు ఆయా నర్సరీలను సందర్శించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని పీవో ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.రమేష్‌కుమార్, పీహెచ్‌వో ఎ.శరత్, పీఏవో కె.జాన్సీలక్ష్మి, ఉద్యానవన అధికారి ఎల్.బొంజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): విమ్స్‌తో పాటు వివిధ ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పలు పోస్టులు భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఆడియోలజిస్ట్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్, ఆర్ట్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ డెస్క్ మేనేజర్, జూనియర్ అసిస్టెంట్, థియేటర్ అసిస్టెంట్ తదితర 23 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. పూర్తి వివరాలతో అభ్యర్థులు https:// visakhapatnam. ap. gov. in/ దరఖాస్తు చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తుతో పాటు విద్యా అర్హత జిరాక్స్ కాపీలను వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలి.


మెడికల్ కాలేజీలో పోస్టులు..

ఆంధ్రా మెడికల్ కాలేజ్ విశాఖపట్నంలో 3 తోటీ(ఓసీ(ఉమెన్)-2, ఎస్సీ(జీ)-1) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జీతం నెలకు రూ.15వేలు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

సిరులు కురిపిస్తున్న ఆగాకర

- అనకాపల్లి జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగు
- రోజుకు 30 టన్నుల వరకు ఎగుమతి
- మార్కెట్లో కిలో రూ.100

గొలుగొండ: ఆగాకర సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. జిల్లాలో ఈ పంట సాగుకు గొలుగొండ మండలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. నాతవరం, నర్సీపట్నం, మాకవరపాలెం ప్రాంతాల్లో రైతులు ఈ పంటలను సాగు చేస్తున్నారు.ఈ సీజన్‌లో ఏ ప్రాంతంలో చూసినా ఆగాకర సాగు కనిపిస్తోంది. కొత్త ఎల్లవరం, రాజుపేట, జిల్లెడుపూడి, గొలుగొండ, జోగుంపేట, అమ్మపేట, చిన్నయ్యపాలెం, కరక, దొనిపాలెం ప్రాంతాలతో పాటు నర్సీపట్నం మండలం గబ్బాడ, వెములపూడి, నాతవరం, మాకవరపాలెం మండలాల్లో కూడా సాగు జరుగుతోంది. అటవీ ప్రాంతంలో మాత్రమే పండే ఈ పంటను తొలుత కొత్త ఎల్లవరం రైతులు వాణిజ్యపరంగా సాగు చేపట్టారు. ఏప్రిల్, మేలో సాగు పనులు ప్రారంభిస్తారు. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు పంట దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో ఆగాకర కిలో రూ.100 ధర ఉంది. ఆగస్టు మొదటివారంలో కిలో రూ.190 ఉండేది. పంట దిగుబడి ప్రారంభం కావడంతో ధర తగ్గిపోయింది. ఇక్కడ పండించిన పంటను వ్యాపారులు కోల్‌కత్తా, రాజమహేంద్రవరం, రాజమండ్రి, విజయవాడ, ఒడిశా మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి కాగా, రూ.1.5 లక్షల వరకు ధర వస్తుందని రైతులు తెలిపారు. ఈ ప్రాంత రైతులు పందిరి సాగు విధానంలో పండిస్తున్నారు.



కొత్త ఎల్లవరంలో కనుచూపు మేర సాగు జరుగుతున్న ఆగాకర



విస్తారంగా కాసిన ఆగాకర

ఆదాయం బాగుంది



ఈ ఏడాది మొదటి నుంచి ధర బాగుంది. వర్షాలు పెద్దగా లేకపోవడం వల్ల కాయ రంగు మారలేదు. దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చిన కొనుగోలు చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో దిగుబడి వస్తే రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది.

–గాడె చినబాబులు, రైతు, గొలుగొండ

పందిరి విధానంతో మంచి దిగుబడి



పందిరి విధానంలో సాగు చేయడం వల్ల మంచి దిగుబడి రావడమే కాకుండా కాయ నాణ్యతగా ఉంటుంది. ఈ ప్రాంతంలో రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అందువల్ల వారికి సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం.

–సుదర్శన, ఉద్యానవనశాఖ అధికారి, నర్సీపట్నం డివిజన్

క్లుప్తంగా...

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

అమ్మవారిని దర్శించుకున్న త్రిదండి దేవనాథజీయర్ స్వామి



అమ్మవారికి పూజలు చేస్తున్న చినజీయర్‌స్వామి

అనకాపల్లి టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి శిష్యులు త్రిదండి దేవనాథజీయర్‌స్వామి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌర్ణమి నుంచి వచ్చేనెల 10వతేదీ వరకు చాతుర్మాస దీక్షలో చిన్నజీయర్‌స్వామి ఉంటారని ఆయన చెప్పారు. ధర్మ ఆచరణ, విద్యకు వినయం, వినయంతో ధర్మం, ధర్మంతో సుఖం, నలుగురి నడవడిక తదిత అంశాలపై ఆయన విద్యార్థులకు వివరించారు. ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి శ్రీధరాల సోమరాజు, వికాస్ తరంగిణి సమన్వయకర్త యర్రంశెట్టి నాని, వికాస్ తరంగిణి జిల్లా అధ్యక్షుడు గ్రంధి మాణిక్యం, ఉపాధ్యక్షుడు కొత్తూరు లక్ష్మాజీ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): పెదవాల్తేరు, పెందుర్తి వసతి గృహాల్లో 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఈ మేరకు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వాల్తేరు వసతి గృహంలో 67, పెందుర్తి వసతిగృహంలో 47 ఖాళీలు ఉన్నట్లు పేర్కొంది. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన శారీరక, బధిర కేటగిరీలకు చెందిన పురుష దివ్యాంగులు ఈ వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సూచించింది. వసతి, ఉచిత భోజనంతో పాటు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. పూర్తి వివరాలకు 99484 97333(పెదవాల్తేరు హాస్టల్ వార్డెన్), 95054 94632(పెందుర్తి హాస్టల్ వార్డెన్)లో సంప్రదించవచ్చు.

టిట్లాఘడ్ వరకే రాయ్‌పూర్-విశాఖ పాసింజర్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తరం): ఈస్ట్‌కోస్ట్ రైల్వే సంబల్‌పూర్ డివిజన్‌లోని తెరుబలి-టిట్లాఘడ్ సెక్షన్‌లో భద్రతాపరమైన నిర్వహణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాయ్‌పూర్‌లో గురువారం బయలుదేరే రాయ్‌పూర్-విశాఖపట్నం (08527) పాసింజర్ స్పెషల్ టిట్లాఘడ్‌వరకే నడుస్తుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం-రాయ్‌పూర్(08528) రైలు టిట్లాఘడ్‌లో బయలుదేరి రాయ్‌పూర్ చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.